# ముందే వచ్చిన సంక్రాంతి

● నగరంలో అంబరాన్నంటిన సంబరాలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నగరంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక శాంతినగర్‌లోని శ్రీఆగస్త్య పాఠశాలలో డైరెక్టర్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు పాల్గొని సంక్రాంతి విశిష్టను విద్యార్థులకు తెలియజేశారు. స్థానిక రామారావుపేట నారాయణ స్కూల్‌లో ఏజీఎం రాఘవేంద్రరావు, జోనల్ అకడమిక్ కో–ఆర్డినేటర్ సుంకర మూర్తి, ప్రిన్సిపాల్ షర్మిల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. పాఠశాల డీన్ రమణారావు, వైస్ ప్రిన్సిపాల్ శిరీష పాల్గొన్నారు. ఎంఎస్ఎన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ప్రిన్సిపాల్ విజయకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మధ్యాహ్నం ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈఓ విజయలక్ష్మి పాల్గొన్నారు. న్యూసెంచరీ స్కూల్‌లో కరస్పాండెంట్ ఎం.రామలక్ష్మి, వెంకట్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. బొమ్మల కొలువు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దులు ఆకట్టుకున్నాయి. స్థానిక టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో సంబరాలు నిర్వహించారు. సీఐ ఎం.అప్పలనాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి సంక్రాంతి పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ పి.శ్రీధర్‌రెడ్డి, పీఆర్‌ఓ ధనుంజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సర్కారు బడుల్లో...**

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగు రోజుల ముందే సంక్రాంతి సందడి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. పాఠశాలల్లో హరిదాసుల హడావుడి, డూడూ బసవన్నల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు పాఠశాలల్లో విద్యార్థులు ప్రభలను అలంకరించి, భోగి మంటలు వేసి, రంగవల్లులు తీర్చిదిద్దారు. జిల్లా వ్యాప్తంగా 1,284 పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**నేటి నుంచి సెలవులు**

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఉత్సాహంగా ఇంటి బాట పట్టారు. 11 రోజుల సెలవుల అనంతరం ఈ నెల 20వ తేదీ నుంచి పాఠశాలలు తిరిగి పునఃప్రారంభమవుతాయి.



ఆగస్త్య పాఠశాలలో సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు



న్యూసెంచరీ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు



రామారావుపేటలోని నారాయణ స్కూల్‌లో విద్యార్థుల సందడి

## పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా

కాకినాడ సిటీ: ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. గురువారం కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి గృహ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలన్నారు. ఇళ్లులేని పేదలకు స్థలాలు ఇవ్వాలని, కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు కేటాయించాలని అన్నారు. ప్రభుత్వం దిగిరాక పోతే ఇళ్ల స్థలాల సాధన సమితి ఏర్పాటు చేసి పోరాటం చేస్తామని మధు హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో బతుకుతున్న పేదలు అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహా కార్యదర్శి తోకల ప్రసాద్, నాయకులు ఎంఎస్ నారాయణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.




తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

## స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేరియర్ కౌన్సెలింగ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూషిప్ అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జోనల్ ఎంప్లాయిమెంట్ అధికారి టి.అనిల్‌కుమార్ హాజరై ఎమర్జింగ్ టెక్నాలజీ (ఏఐ,ఎజీఐ), భవిష్యత్ అవకాశాలపై వివరించారు.. జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు, కోనసీమ జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.వసంతలక్ష్మి, ఉప కల్పన అధికారి శిరీష, మినిస్ట్రీ ఆఫ్ లేబర్ ఎంప్లాయిమెంట్ అధికారి ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ తిరుపాణ్యం పాల్గొన్నారు.

## వైద్యుల సలహాలు పాటించాలి

కరప: ప్రతి నెలా గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గురువారం వేళంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఆయన అవగాహన కల్పించారు.

## సేవలు చిరస్మరణీయం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సీపీఎం కమిటీ సభ్యురాలిగా కుడుపూడి రాఘవమ్మ అందించిన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు కొనియాడారు. గురువారం కాకినాడ సుందరయ్యభవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ కుడుపూడి రాఘవమ్మ సంతాప సభ నిర్వహించారు. సీపీఎం జిల్లా సీనియర్ నేత దువ్వా శేషుబాబ్జీ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కరణం ప్రసాదరావు, జి.బేబిరాణిలు రాఘవమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## పారిశుధ్య నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

కాకినాడ సిటీ: పారిశుధ్య నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. గురువారం తెల్లవారుజామున ఆమె నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. గాంధీనగర్ ప్రాంతంలోని గాంధీ పార్కు, రైతుబజార్, సుబ్బయ్య హోటల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ జరుగుతున్న తీరును గమనించారు. దీనిపై అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా తీసుకుంటున్నారా అని ఆరా తీశారు. అపార్టుమెంట్ల నుంచి చెత్త సేకరణపై ప్రశ్నించారు. చెత్త సేకరణ వాహనాల రాకపోకల సమయాలను పరిశీలించారు. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని, పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని సూచించారు. ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం తెల్లవారుజామున నగరంలో పారిశుధ్య పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్ భావన

## శబరిమల విధానం అమలు చేయాలి

బోట్‌క్లబ్: ఏటా తిరుమలలో ముక్కోటి ఏకాదశి దర్శనం టిక్కెట్ల జారీ శబరిమల ట్రావెన్‌కోర్ బోర్డు అనుసరిస్తున్న విధానంలో నిర్వహించాలని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

## మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్‌లు నడిపిన కేసుల్లో వ్యక్తులకు శిక్ష విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. గురువారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా 14 మందికి రెండు రోజుల చొప్పున జైలు, 13 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వచ్చేవారి నుంచి, తిరిగి పయనమయ్యే ప్రజల నుంచి ప్రైవేట్ బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కె.శ్రీధర్ స్పష్టం చేశారు. తన కార్యాలయంలో గురువారం ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఈ నెల 20 వరకూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ఫేజ్-1 సర్వీస్ ప్రొవైడర్ల నమోదు ప్రారంభం

కాకినాడ సిటీ: సేవా రంగంలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని ఉపాధి అవకాశాలను పెంచుకుంటూ ఆర్థికంగా ఎదగాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి ప్రియంవద సూచించారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు ఫేజ్–1 కార్యక్రమాన్ని గురువారం భానుగుడి పాత మీ సేవ సెంటర్లో నిర్వహించారు. వృత్తిదారుల రిజిస్ట్రేషన్ నమోదులో ప్రియంవదతో పాటు టౌన్ ప్రాజెక్టు అధికారి కె.శైలజ పాల్గొని అవగాహన కల్పించారు. వడ్రంగి, ప్లంబింగ్, కార్పెంటర్, గృహోపకరణాల మరమ్మతులు, బ్యూటీషియన్ సేవలు తదితర వృత్తుల్లో ఉన్నవారికి హోమ్ ట్రయాంగిల్ యాప్ ద్వారా ప్రజలకు సేవలను అందించనున్నట్లు తెలిపారు.

## నేడే ముక్కోటి ఏకాదశి

బోట్‌క్లబ్: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం వైష్ణవ ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. స్థానిక గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. జగన్నాథపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయం, పళ్లంరాజునగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, మెహర్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం కల్పిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ సుబ్బారావు ఆదేశించారు. జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆయన పరిశీలించారు. దేవదాయ శాఖ డీసీ రమేష్‌బాబు గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాట్లు పరిశీలించారు.



జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈఓకు సూచనలు ఇస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు





## సంతాన సాఫల్యం సులభతరం

కాకినాడ క్రైం: ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో లండన్ ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. 2015లో విశాఖపట్నంలో తొలి బ్రాంచ్ ప్రారంభించినట్లు చెప్పారు. సంతానోత్పత్తి చికిత్సలో విశేష సేవలందిస్తోందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత జెనోమిక్ ఫెర్టిలిటీ అనాలసిస్ టెక్నాలజీని లండన్ ఐవీఎఫ్ అందిపుచ్చుకుందన్నారు. జీనీఫెమినా, జీనీ యాండ్రో అనే అధునాతన సాంకేతిక ప్రక్రియల ద్వారా పురుషులతో పాటు మహిళల్లోనూ వంధ్యత నివారణకు చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. జీన్ టెక్, జీఎఫ్ఏ టెక్నాలజీల సాయంతో జీనీఫెమినా, జీనియాండ్రో చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. యూకేలో శిక్షణ పొందిన వైద్య నిపుణులను ఈ చికిత్సల కోసం వినియోగిస్తున్నామన్నారు. పునరుత్పత్తి వైఫల్యాలను కనుగొనేందుకు చేసిన కృషికి గాను టైమ్స్ గ్రూప్ ద్వారా ఏపీ బెస్ట్ అవార్డును అందుకున్నామని చెప్పారు. జీన్‌టెక్ వ్యవస్థాపకులు, చీఫ్ సైన్స్ అధికారి డాక్టర్ అనురాధా ఉడుముడి పునరుత్పత్తి చికిత్సా విధానాలలో సాంకేతికతను జోడించేందుకు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.



జీన్‌టెక్ సంస్థతో సాంకేతిక ఒప్పందాలను కుదుర్చుకుంటున్న లండన్ ఐవీఎఫ్ ప్రతినిధులు

## గ్రామీణ ప్రజలకు అత్యాధునిక నేత్ర వైద్య సేవలు

పెదపూడి: అనపర్తి నారాయణరెడ్డి కంటి ఆస్పత్రిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన రోబోటిక్ లేజర్ లాసిక్ శస్త్రచికిత్స అందుబాటులో ఉందని నేత్ర వైద్య నిపుణుడు తేతలి సత్యనారాయణరెడ్డి తెలిపారు. అనపర్తి, పరిసర గ్రామాల ప్రజలకు 50 ఏళ్లుగా కంటి వైద్యం అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆధునిక పరికరాలతో, అత్యాధునిక సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. తేతలి సత్యనారాయణరెడ్డి తనయుడు డాక్టర్ వెంకటరామిరెడ్డి, కోడలు డాక్టర్ సంధ్యారెడ్డి కంటి వైద్యంలో ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానాన్ని సామాన్యులకు అందుబాటులో తీసుకువస్తున్నారన్నారు.

## విస్తృత వైద్య సేవల్లో ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

పిఠాపురం: పిఠాపురం పట్టణంలో 2019 నుంచి వైద్య సేవలను అందిస్తూ, ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించే లక్ష్యంతో పనిచేస్తోంది. ఆసుపత్రి ఆర్థోపెడిక్స్, రుమటాలజీ, రీజెనరేటివ్ మెడిసిన్ వంటి వైద్య సేవల్లో ప్రత్యేకత కలిగి ఉంది. ఈ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ తొలి గుర్తింపు పొందిన ఆర్థోపెడిక్ రుమటాలజిస్ట్ డాక్టర్ జి.సురేష్. ఆయన లక్నోలోని రామ్ మనోహర్ లోహియా విశ్వవిద్యాలయం నుంచి ఆర్థోపెడిక్ రుమటాలజీ, రీజెనరేటివ్ ఆర్థ్రోబయాలజిక్స్‌లో ఫెలోషిప్ పొందారు. ఆయన రూపకల్పన చేసిన ప్రొలోజోన్, అగ్మెంటెడ్ ప్రొలోజోన్ ట్రీట్మెంట్స్ ఆస్టియోఆర్థిటిస్ మోకాళ్ల చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. డాక్టర్ సురేష్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పురస్కారాలను అందుకున్నారు. డాక్టర్ మంజుషా సాలాడి, ఆసుపత్రి మేనేజింగ్ పార్టనర్, గైనకాలజీ, ప్రసూతి విభాగానికి అధిపతిగా ఉన్నారు. మినిమల్ ఇన్వేసివ్ సర్జరీలు, హై–రిస్క్ ప్రెగ్నెన్సీలను విజయవంతంగా నిర్వహించడంలో ఆమె అనుభవజ్ఞురాలు. ఎంఎస్ ఆసుపత్రి స్థాయి–2 ఐసీయూ సేవలను ప్రారంభించి ప్రజలకు విశేష సేవలందిస్తున్నారు. ఈ ఆసుపత్రి అనేక క్లిష్టమైన వైద్య కేసులను విజయవంతంగా పరిష్కరించి, ప్రజల నమ్మకాన్ని చూరగొన్నారు.

## 'గ్లాస్ హౌస్ షోరూమ్'లో సంక్రాంతి డిస్కౌంట్ ఆఫర్లు

బోట్‌క్లబ్: కాకినాడ మెయిన్ రోడ్డు గ్లాస్‌హౌస్ షోరూంలో సంక్రాంతి సందర్భంగా కొన్ని రకాల కంపెనీ ఉత్పత్తులపై స్పెషల్ డిస్కౌంట్లు ఇస్తున్నట్టు గ్లాస్‌హౌస్ సంస్థ అధినేత మండా శేఖర్ తెలిపారు. తమ తండ్రి మండా వీరభద్రరావు 'గ్లాస్‌హౌస్'ను కాకినాడ పట్టణంలో సుమారు 55 సంవత్సరాల క్రితం ప్రారంభించారని, అప్పట్లో గ్లాస్‌హౌస్‌లో కప్ అండ్ సాసర్‌కు మంచి డిమాండ్ ఉండేదని, అలాగే ఇతర గృహోపకరణ వస్తువులకు మంచి పేరుండేదన్నారు. దీంతో ఈ సెంటర్‌కు 'గ్లాస్‌హౌస్' సెంటర్‌గా పేరొచ్చినట్టు శేఖర్ చెప్పారు. నగరంలో పింగాణి, గాజు, మరికొన్ని ప్రత్యేక గృహోపకరణాలకు అవసరమైన వస్తువులు సరసమైన ధరలకు అందిస్తామని అన్నారు. తమ షాపులో కొనుగోలు చేసిన గృహోపకరణాలకు కంపెనీ గ్యారెంటీతోపాటు ఫ్రీ సర్వీసింగ్ సెంటర్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అన్ని కంపెనీల గృహోపకరణాలు తమ వద్ద లభిస్తాయని శేఖర్ వివరించారు.

## వైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న 'అనురాగ హాస్పిటల్'

బోట్‌క్లబ్: కాకినాడలో అనురాగ హాస్పిటల్ కొన్నేళ్లుగా వైద్య రంగంలో అనేక మందికి విశిష్ట సేవలందిస్తూ ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. హాస్పటల్ నిర్వాహకుడు డాక్టర్ సీసీ మల్లిఖార్జున పర్యవేక్షణలో మానసిక వ్యాధిగ్రస్తులకు విశేష సేవలు అందిస్తున్నారు. అలాగే ఆయన కుమారుడు డాక్టర్ విక్రమ్ చైతన్య ఆధ్వర్యంలో సైకో థెరపీ, గ్రూప్ థెరపీ, సైకలాజికల్ టెస్ట్‌లు, మత్తు పదార్థాల అలవాట్లు మానేందుకు మెరైటల్, సెక్స్ సంబంధ సమస్యలతో వచ్చిన వారి సమస్యలకు కూడా వైద్య సేవలు అందిస్తున్నారు. మరో అనుభవజ్ఞులైన డాక్టర్ కృష్ణవాసన్ ఆధ్వర్యంలో స్పీచ్‌థెరపీ, ఆక్యూపేషనల్ థెరపీ, సెన్సరీ ఇంటిగ్రేషన్, బిహేవర్ థెరపీ వంటి వ్యాధులకు కూడా ట్రీట్‌మెంట్ చేస్తున్నట్టు డాక్టర్ మల్లిఖార్జున తెలిపారు.

## కాకినాడ చందన బ్రదర్స్ షాపింగ్ మాల్‌లో 'సంక్రాంతి గిఫ్ట్స్'

బోట్‌క్లబ్: అన్ని రకాల వస్త్రాలు, రెడీమేడ్స్‌పై 50 శాతం వరకూ తగ్గింపు, ప్రతి రూ.వెయ్యి ఆపై కొనుగోలుపై కచ్చితమైన స్పాట్ గిఫ్ట్ కూడా కాకినాడ చందన బ్రదర్స్ షాపింగ్ మాల్‌లో అందిస్తున్నారు. కాకినాడ నగరంలో మొట్ట మొదటిసారిగా చందన బ్రదర్స్ వస్త్ర దుకాణాన్ని 27 ఏళ్ల క్రితమే ప్రజల ముందుకు తీసుకు వచ్చినట్లు షోరూమ్ అధినేత అల్లక మల్లికార్జునరావు (మల్లిబాబు) చెప్పారు. సంక్రాంతి పండగల సందర్భంగా తమ ఖాతాదారులు, శ్రేయోభిలాషులు, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో పెట్టుబడి చీరలు కేవలం రూ.95 నుంచి ఉన్నాయన్నారు. అలాగే కంచి పట్టు చీరలు, ఫ్యాన్సీ, వర్క్, కాటన్ చీరలు, యువతకు కావాల్సిన డ్రెస్స్ మెటీరియల్స్, పంజాబీ డ్రెస్‌లు, టాప్స్, లెగిన్స్, కిడ్స్ రెడీమేడ్స్, మెన్స్‌వేర్, సూటింగ్స్ – షర్టింగ్స్ అన్ని 50 శాతం వరకూ తగ్గింపు, 1+1 ఆఫర్లు అందిస్తున్నారన్నారు. జ్యూయలరీ విభాగంలో తరుగు 3 శాతం నుంచి మొదలవుతుందన్నారు. వెండి రెగ్యులర్ వస్తువులపై తరుగు మజూరీ లేదన్నారు.

## 120 ఏళ్లుగా వైద్య సేవల్లో సీఎంసీ ఆస్పత్రి

పిఠాపురం: పిఠాపురం పట్టణంలో 120 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తోన్న సీఎంసీ హాస్పటల్ ఎంతో ఘన చరిత్ర కలిగి ఉంది. అనుభవం కలిగిన డాక్టర్ల పర్యవేక్షణలో అధునాతన వైద్య పరికరాలతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తూ ఈ ప్రాంత ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్నామని సీఎంసీ హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అమృత లాల్ తెలిపారు. స్త్రీల వైద్య, ప్రసూతి సేవలు, కంటి వైద్య సేవలు, ఎముకలు, ఊపిరితిత్తులు, చర్మ, గుండె, నరాల వ్యాధులతో వస్తోన్న రోగులకు అనుభవం కలిగిన వైద్యులతో సేవలు అందిస్తున్నామని చెప్పారు. లేప్రో స్కోపిక్ ద్వారా కోత లేకుండా ఆపరేషన్ చేస్తున్నట్టు డాక్టర్ అమృత్‌లాల్ పేర్కొన్నారు. ఈ ఆస్పత్రిలో వైద్యసేవల కోసం వచ్చేవారికి అందుబాటులో రుచి శుభ్రతతో కూడిన ఆహారం అందించే కేంటిన్ సదుపాయం కూడా ఏర్పాటు చేశామన్నారు.

## సుజుకీ వారి బంపర్ ఆఫర్లు

అమలాపురం టౌన్: సుజుకీ ఆథరైజ్డ్ డీలర్ కంటిపూడి సుజుకీ సంక్రాంతి సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేకమైన లక్కీ డ్రా ఆఫర్ల సౌకర్యం కల్పించింది. మొదటి బహుమతిగా మారుతీ సుజుకీ ఫ్రాంక్స్ కారు, రెండో బహుమతిగా అయిదుగురికి సుజుకీ జిక్సర్ ఎస్ఎఫ్ 250 బైక్, మూడో బహుమతిగా 15 మందికి సుజుకీ జిక్సర్ 250 బైక్స్, నాలుగో బహుమతిగా 20 మందికి ఆపిల్ ఐ ఫోన్ (15, 128 జీబీ)ను ప్రకటించారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా

కరప: సంక్రాంతి ముందే వచ్చింది.. సంబరాలు తెచ్చింది.. పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలతో కలసి ఉల్లాసంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలలో సందడి చేశారు. సర్పంచ్ బిరుదా సరస్వతి, ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు పబ్బినీడి పద్మావతి, ఎస్ఎంసీ చైర్మన్ యాళ్ల నాగమణి, హెచ్ఎం ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్, పీడీ బీవీవీఎస్‌వీ ప్రసాద్ విద్యార్థులతో కలసి భోగి మంట వేశారు. విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పొంగలి పొంగించి సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.



పెద్దాపురప్పాడు హైస్కూలులో భోగి మంటను వెలిగిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, ఉపాధ్యాయులు

## పేద విద్యార్థులకు అండగా..

బోట్‌క్లబ్: ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు తమ సత్రం అండగా ఉంటుందని ముత్తా రామన్న సత్రం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్లు ముత్తా వెంకటేష్, ప్రసాద్‌బాబు అన్నారు. కాకినాడ నగరంలోని పలు మున్సిపల్ స్కూల్‌లో చదువుతున్న నిరు పేదలకు గురువారం స్కాలర్‌షిప్‌లు అందించారు. తమ సత్రం ఆధ్వర్యంలో నగరంలో పలు పాఠశాలల్లో చదువుతూ ప్రతిభ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు చెప్పారు. పరివర్తన వీధి బాలల పునరావాస కేంద్రానికి రూ.లక్ష, సాలిపేట మున్సిపల్ గరల్స్ హైస్కూల్, జగన్నాథపురం మున్సిపల్ స్కూల్‌లో చదువుతున్న 44 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందించారు. పరివర్తన వీధిబాలల పునరావాస కేంద్రం కార్యదర్శి వక్కలంక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథపురం మున్సిపల్ స్కూల్‌లో స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో సభ్యులు

## రెడ్‌కాన్వెంట్ చారిటబుల్ ట్రస్ట్ చేయూత



రెడ్‌కాన్వెంట్ ట్రస్ట్ ద్వారా సహాయం చేస్తున్న సభ్యులు

బాలాజీచెరువు: రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ద్వారా ఏడేళ్లలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని కార్యాలయంలో 90 మంది పేదలకు ఉచితంగా కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. విద్యార్థిని సీహెచ్ రేష్మకు రూ.15 వేల ఉపకార వేతనం అందజేశారు. ప్రతి ఏడాది 28 మంది విద్యార్థులకు రూ.6 లక్షలు, 1500 మంది పేదలకు వస్త్రాలు, కళ్లజోళ్లు అందజేయడం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కళ్యాణి, రెడ్నా రమణామూర్తి, దేవిక, ప్రభాకర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.